
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శనివారం 31 ఆగస్టు 2024



వేములవాడకు పోటెత్తిన భక్తులు




స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు 8

డైలీ ఫైనాన్స్ వ్యాపారులపై పోలీసుల కొరడా 7

- జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో దాడులు

విస్తరిస్తున్న డెంగ్యూ



- 28 రోజుల్లోనే 24 కేసులు
- పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థుల హాజరు
- పెరుగుతున్న వైరల్ జ్వరాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

జిల్లాలో ఎవరి నోట విన్నా జ్వరాలతో బాధపడుతున్న ఆవేదననే వినిపిస్తోంది. గతంలో కంటే ఈసారి విషజ్వరాలతో పాటు డెంగ్యూ వేగంగా విస్తరిస్తోంది. రక్తపరీక్షలు చేయించుకున్న వారికి ప్లేట్‌లేట్స్ తగ్గినట్లుగా రిపోర్టు వస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. తమకు డెంగ్యూ సోకిందంటూ ఆసుపత్రిలో చేరుతుండడం వైద్య ఖర్చులు కూడా తడిసి మోపడవుతుండడంతో మానసికంగా కుంగిపోతున్నారు. తెల్ల రక్తకణాలు తగ్గిందంటే ప్రాణాలకే ప్రమాదమని భావిస్తున్న క్రమంలో ప్రైవేటు ఆసుపత్రుల్లో అనవసరమైన ఖర్చులు కూడా వైద్యులు పెంచుతున్నారనే విమర్శలు ఉన్నాయి. 20 వేల ప్లేట్‌లేట్స్ సంఖ్య తగ్గితేనే డెంగ్యూ సంకేతాలుగా భావించాలని కొందరు వైద్యులు చెబుతున్నా.. 50 నుంచి 60 వేల వరకు ప్లేట్‌లెట్స్ ఉన్నా కొందరు ప్రైవేట్ వైద్యులు ప్రమాదకరమంటూ హెచ్చరిస్తుండడంతో రోగులు ఆందోళన చెందుతున్నారు.

ఆగస్టులో డెంగ్యూ కేసులు...

ఆరోగ్య కేంద్రం	కేసులు
తంగళ్లపల్లి	02
చీర్ల వంచ	01
ఇల్లంతకుంట	03
ఎల్లారెడ్డిపేట	04
హన్మాజిపేట	02
చందుర్తి	01
కొదురుపాక	01
సిరిసిల్ల పీఎస్, ఏబీనగర్	10
మొత్తం	24

● 28 రోజుల్లో 24 డెంగ్యూ కేసులు...

జిల్లాలో డెంగ్యూ కేసులు వేగంగా విస్తరిస్తున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ ఫీవర్ సర్వేను కొనసాగిస్తోంది. డెంగ్యూ కేసులు గడిచిన 28 రోజుల్లో 24 కేసులు వచ్చాయి. జనవరి నుంచి ఇప్పటి వరకు 35 కేసులు రావడం గమనార్హం. ప్రతి యేటా కూడా డెంగ్యూ కేసులు పెరుగుతూనే ఉన్నాయి. సీజనల్ వారీగా వచ్చే వ్యాధులను తగ్గించడానికి వైద్య ఆరోగ్య శాఖ డ్రైడే కార్యక్రమా లను నిర్వహిస్తోంది. మరోవైపు విషజ్వరాలు, డెంగ్యూ లక్షణాలతో మృత్యువాత కూడా పడుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు నలుగురు మృతిచెందారు. వైద్య ఆరోగ్య శాఖ డెంగ్యూకు సంబంధించి హైరిస్క్ గ్రామాలుగా వేములవాడ మండలం అనుపురం, నాంపల్లి, శాత్రాజుపల్లి, బోయినపల్లి మండలం గుండన్నపల్లి, కోనరావు పేట మండలం కనగర్తి, ఎల్లారెడ్డిపేట మండలం కంచర్ల, హరిదాస్ నగర్, వీర్నపల్లి మండలం రంగంపేట, ఇల్లంతకుంట మండలం వల్లం పట్ల, తాళ్లపల్లి, అర్అండ్‌ఆర్ కాలనీ, చీర్లవంచ, లక్ష్మీపూర్, ముస్తాబాద్ మండం కొండాపూర్, తంగళ్లపల్లి మండలం తంగళ్లపల్లి, మండెపల్లి, సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలో చంద్రంపేట, రెడ్డివాడ, పద్మనగర్, శాంతినగర్, వేములవాడ మున్సిపాలిటీలో సాయినగర్, విద్యానగర్, భగవంతరావు నగర్‌ను హైరిస్క్‌గా గుర్తించి ప్రత్యేక దృష్టి పెట్టారు.

● పాఠశాలల్లో తగ్గుతున్న హాజరు...

జిల్లాలో జ్వర పీడితులతో ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులు కిక్కిరిసి పోతుండగా ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలల్లో జ్వరాలతో హాజరు శాతం కూడా తగ్గిపోతుంది. మరోవైపు జ్వరాలు ఎక్కువగా ఉండడంతో వ్యాధుల భయంతో పిల్లల తల్లిదండ్రులు కూడా ఆందోళన చెందుతున్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులు ఎలా ఉన్నారనే భయాందోళనలు కూడా నెలకొన్నాయి.

● డెంగ్యూపై భయం వద్దు...

డెంగ్యూ విషజ్వరాలతో భయం వద్దని జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్లేట్‌లేట్స్ తగ్గడంతో సమస్యలు ఎదురవుతున్నా వాటిని అధిగమించడానికి చికిత్సలు ఉన్నాయని జ్వరం వచ్చిన ప్రతిసారి డెంగ్యూ అని భయపడవద్దని 90 శాతం మంది డెంగ్యూ మామూలు జ్వరంలాగే తగ్గిపోతుందని వైద్యులు సూచిస్తున్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీటి తొట్టిల్లో దోమలు చేరకుండా మూతలు బిగించుకొని కుండీల్లో తరచూ నీటిని శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు. డెంగ్యూ వ్యాధి ఏడీస్ ఈజిప్ట్ దోమ వల్ల వస్తుంది. ప్లేవీ సూక్ష్మ జీవి ద్వారా వ్యాపిస్తుంది. ఈ దోమలు పగటి పూటనే కుడుతాయి. చికెన్ గున్యా కంటే ఎక్కువగా ఒంట్లో శక్తిని హరిస్తుంది. డెంగ్యూ వ్యాధి జ్వర పీడితులకు తీవ్రమైన తలనొప్పి ఉంటుంది. తీవ్రమైన జ్వరం, శరీరంపై దద్దుర్లు, చర్మం ద్వారా రక్తస్రావం, కండరాలు, కీళ్లనొప్పులు, ఆకలి మందగిస్తుంది. నొప్పితో కూడిన కంటి కదలికలు, వాంతులు, విరోచనాలు కూడా కలుగుతాయని డాక్టర్లు సూచిస్తున్నారు. డెంగ్యూ లక్షణాలు కనిపించగానే జాప్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, ప్రైవేటు ఆసుపత్రుల్లో తగిన వైద్య సేవలు పొందాలి. డెంగ్యూ వ్యాధి ఏలీసా పరీక్ష ద్వారా నిర్ధారణ చేసుకొని చికిత్స పొందాలని వైద్య నిపుణులు తెలుపుతున్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడికి అభినందన



జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఉపాధ్యా పురస్కారానికి ఎంపికైన తాడూరి సంపత్‌కుమార్‌ను కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా అభినందించారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో సంపత్‌కుమార్‌ను అభినందించి విద్యార్థుల్లో సృజనాత్మకతను ఆలోచనలు, వెలికితీయడంపై అభినందనలు తెలిపారు. విద్యార్థులకు అదనపు సమయంలో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ భాష, గణిత నైపుణ్యాలను పెంపొందించేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం కేటాయించిన సెలవులను వీలైనంత తక్కువగా వినియోగించుకొని విద్యార్థుల అభివృద్ధి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సంపత్‌కుమార్, వంద మంది గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అవిష్కర్తలుగా చేయాలనే సంకల్పంతో మిషన్ 100 అనే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు 53 మంది విద్యార్థులతో ఆవిష్కరణలు రూపొందించి ఎనిమిది మంది విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి, 16 మంది విద్యార్థులు జాతీయ స్థాయి బహుమతులను గెలుచుకునేలా తీర్చిదిద్దారు. హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును కూడా సాధించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డీఈవో రమేష్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు, జిల్లా సైన్స్ అధికారి దేవయ్య ఉన్నారు.

పాడి గేదెల యూనిట్లపై అవగాహన



మాట్లాడుతున్న డీఆర్‌డీవో శేషాద్రి

సిరిసిల్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళ శక్తి పథకం కింద మహిళ సంఘాల సభ్యులకు అందించే పాడిగేదేల యూనిట్ల ఎంపికపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా సమాఖ్య భవనంలో నిర్వహించిన అవగాహన సదస్సులో డీఆర్‌డీవో శేషాద్రి, లబ్ధిదారుల ఎంపిక, రుణాల పక్రియ, ముర్రా జాతి గేదేల ఎంపిక, భీమా తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, జిల్లా పశు వైద్యాధికారి రవీందర్‌రెడ్డి, డీపీఎంవో లు పద్మయ్య, సుధారాణి, అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు, ఎంపికలు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 30: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 3వతేదీ నుంచి 6వరకు క్రీడా పోటీలు, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికలు జరుగుతాయని ఎస్‌జీఎఫ్ సిరిసిల్ల మండల కన్వీనర్ ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు అండర్-14, అండర్-17 విభాగాల్లో పోటీలను సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో సెప్టెంబరు 3న ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. 3న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్(బాలురు), 4న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్(బాలికలు), 6న బాలబాలికలకు అథ్లెటిక్స్ పోటీలు, ఎంపికలు జరుగుతాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆధార్‌కార్డుతో పాటు స్టడీ సర్టిఫికెట్‌తో రావాలని పేర్కొన్నారు.

ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా రాజిరెడ్డి

వేములవాడ, ఆగస్టు 30: వేములవాడ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా రాజిరెడ్డి శుక్రవారం విధుల్లో చేరారు. సుల్తానాబాద్, కరీంనగర్‌లో విధులు నిర్వహించిన రాజిరెడ్డి వేములవాడ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. గతంలో ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన సురేంద్రబాబు ఎల్లారెడ్డికి బదిలీ కావడంతో నెల రోజులుగా వేములవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లో దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన కార్యకలాపాలు దాదాపుగా నిలిచిపోయాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కరీంనగర్ డీఐజీ రవీందర్ బుధవారం నాడు వేములవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా రాజిరెడ్డి బాధ్యతలు తీసుకున్నారు.

మైనార్టీ స్కూళ్లలో టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు

సిరిసిల్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులు, గెస్ట్ ఫ్యాకల్టీలను తాత్కాలిక పద్ధతిలో నియమించడానికి అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు అహ్వానిస్తున్న ట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన వారై 18 నుంచి 44 సంవత్సరాల వయస్సు కలవారు కలెక్టరేట్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయంలో సెప్టెంబరు 9 లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9949771639 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు

వీర్నపల్లి, ఆగస్టు 30: రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నామని బీజేపీ జిల్లా కార్యదర్శి, మండల ఇన్‌చార్జి గజబింకార్ చందు అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో చేనేత సెల్ కార్యదర్శి విజయ్‌తో కలిసి బూత్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వ నమోదుపై శుక్రవారం దిశానిర్దేశం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామాల్లో ప్రతీ బీజేపీ కార్యకర్త పండుగలా జరపాలన్నారు.

సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల మాజీ అధ్యక్షుడు బోడ మల్లేశం, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి భూక్య రమేష్, మండల కార్యదర్శి పోతారం నరేష్, నాగరాజు, రాజు, బీజేవైఎం మాజీ మండల అధ్యక్షులు వినోద్ ప్రవీణ్ యాదవ్, రాజేందర్, వెంకట్, తిరుపతి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా - ఎస్సీ బాలుర వసతి గృహం ఆకస్మిక తనిఖీ

చందుర్తి, ఆగస్టు 30: వసతి గృహాల్లో వర్షాకాలం సీజన్ దృష్ట్యా స్వచ్ఛత.. పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. చందుర్తి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని స్టోర్ రూం, టాయిలెట్స్, కిచెన్, గదులు, రిజిస్టర్లు పరిశీలించారు. మొత్తం ఎంత మంది విద్యార్థులు ఉన్నారని డీఎస్ సీడీవో విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను ఉదయం ఏమి టిఫిన్ పెట్టారని అడుగగా, అటుకులు, సేమియా ఇచ్చామని చెప్పారు. సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ చందుర్తిలోని ప్రాథమిక పాఠశాలలో తరగతి గదిలో విద్యార్థులతో మ్యాథ్స్ సమస్యలను పరిష్కరింపజేశారు. ఇంగ్లీష్ పాఠ్యపుస్తకంలోని పాఠాన్ని చదివించారు. విద్యార్థులు రాయడం, చదవడం, సమస్యల పరిష్కారంలో ముందు ఉండేలా చూసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు సిద్ధం చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఆయన వెంట డీఈవో రమేష్ కుమార్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 30: విద్యార్థినులు పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ రమాకాంత్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మం డలం అల్మాస్‌పూర్‌లోని కేజీబీవీలో శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రమాకాంత్ మాట్లాడుతూ విద్యార్థినులపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే తమ కు సమాచారం అందించాలని అన్నారు. సోషల్‌మీడియా, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ రమాకాంత్ అన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో అజంత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడతున్న రుద్రంగి ఎస్‌ఐ అశోక్

వీర్నపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోక్సో చట్టాలపై ఎస్సై ఎల్లాగౌడ్ శుక్రవారం అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థినులు లైంగిక వేధింపులకు గురైతే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వేధించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సిబ్బంది మల్లాగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల లైంగిక వేధింపులపై కేజీబీవీ, కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సిరిసిల్ల అశోక్ మాట్లాడుతూ బాలికలు ఆపద వేళల్లో 100, 1098కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలల హక్కులు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ముస్తాబాద్, ఆగస్టు 30: ముస్తాబాద్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ల పనితీరు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానిక కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. వంటలు, భోజనాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకన్నారు. మెనూను పాటిస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. కలెక్టర్ వెంట కార్యక్రమంలో ఆయన వెంట డీఈవో రమేష్‌కుమార్, తహసీల్దార్ సురేష్, పాఠశాల ప్రత్యేక అధికారిణి శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం బీసీ సంఘ రాష్ట్ర నాయకులు అదనపు కలెక్టర్‌ను కలిశారు. రేషన్ షాపుల్లో జనాభా ప్రాతిపాదికన బీసీలకు అవకాశం ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో బీసీ సంఘ రాష్ట్ర నాయకులు శీలంస్వామి, మెంగని మనోహర్, కోడె శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



కస్తూర్బా పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ప్రమాదకరంగా అప్రోచ్ రోడ్లు

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

రుద్రంగి, ఆగస్టు 30 రుద్రంగి మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు ముగియడంతో రోడ్డుకు ఇరువైపులా మురికికాలువ నిర్మాణ పనులు నెలరోజుల క్రితం పూర్తయ్యాయి. రోడ్డును సుమారు రెండు మీటర్లు ఎత్తు పెంచడంతో అప్రోచ్ రోడ్లు ప్రమాదకరంగా మారాయి. కాలనీల నుంచి ప్రధాన రహదారికి వచ్చేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా నిర్మించిన రహదారికి ఇరువైపులా సుమారు 30 వరకు అప్రోచ్ రోడ్లు ఉన్నాయి. రోడ్డు ఎత్తుగా ఉండడంతో కాలనీల రోడ్లు పూర్తిగా కిందకు అయ్యాయి.

దీంతో కాలనీల నుంచి ప్రధాన రహదా రిపైకి వచ్చే సమయంలో, అలాగే ప్రధాన రహదారి నుంచి కాలనీలకు కిందకు దిగే సమయంలో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవు తున్న సంఘటనలు చాలా ఉన్నాయి. మండల పరిషత్ కార్యాలయం ముందు గల రోడ్డు వర్షాలకు కోతకు గురికావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఎదుట అప్రోచ్ రోడ్డు సుమారు మూడు మీటర్లు ఎత్తు పెంచడంతో ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్ నుంచి ఇందిరా చౌక్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా సుమారు 10 అప్రోచ్ రోడ్లు ప్రమాకరంగా ఉన్నాయి. దీంతో రాత్రి సమయంలో వాహనదారులు అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్లలో మొరం మట్టి పోసి సమాంతరంగా చేసి, సీసీ రోడ్లు నిర్మించాలనిప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం ఎదుట ఉన్న అప్రోచ్ రోడ్డులో అదుపుతప్పి కింద పడ్డ వాహనదారుడు

సమస్యను పరిష్కరించాలి

-నాగులపల్లి రవీందర్, గ్రామస్థుడు



ప్రధాన రహదారి వెంట ప్రమాదకరంగా ఉన్న అప్రోచ్ రోడ్ల సమస్యను వెంటనే పరిష్కరించాలి. ఆరు నెలల నుంచి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా పట్టించుకునే వారు లేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరం గా ఉన్న అప్రోచ్ రోడ్లలో మొరం మట్టి పోసి సమానం చేయాలి. సీసీ రోడ్లను వెంటనే నిర్మించాలి.

ఇల్లందకుంట ఎస్ఐపై ఏసీపీకి ఫిర్యాదు

హుజూరాబాద్, ఆగస్టు 30: ఇల్లందకుంట ఎస్ఐ రాజ్‌కుమార్ అకారణంగా దూషించారని, మహిళా కానిస్టేబుల్‌తో కొట్టించారని. తనకు న్యాయం చేయాలని బాధితు రాలు పైడిపల్లి స్వప్న శుక్రవారం ఏసీపీ శ్రీనివాస్‌జికి ఫిర్యాదు చేశారు.ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన తనను ఏడాదిన్నర క్రితం కట్కూరి నాగరాజు అత్యాచార యత్నానికి పాల్పడగా కేసు నమోదు అయిందన్నారు. అది మనసులో పెట్టుకొని తరుచూ నాగరాజు, అతని భార్య సూటిపోటీ మాటలు అనడంతో వారం రోజుల క్రితం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ తననే బూతులు తిట్టారని, అంతేకాకుండా మహిళా పోలీసులతో కొట్టించారన్నారు. తన కు న్యాయం చేయాలని ఏసీపీని కోరగా జమ్మికుంటరూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐని కలువాలని సూచించినట్లు తెలిపారు. ఎస్ఐపై సీపీకి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా బాలికల రోడ్ సైక్లింగ్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 30: జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి బాలిలక రోడ్ సైక్లింగ్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. నగరంలోని శాతవాహన యూనివర్సిటీ ప్రాంగణంలో ఉదయం 7గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మెన్, ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక వావిలాలపల్లిలోని ఆల్ఫోర్స్ టైనిటాట్స్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎంపిక పోటీల్లో అండర్-14, 16, 18, 23 అపై వయస్సు విభాగాలలో బాలికలకు పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను సెప్టెంబరు 14,15 తేదీల్లో నిజామాబాద్‌లో నిర్వహించే ప్రాంతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీలకు, జనగామలో నిర్వహించే రాష్ట్ర స్థాయి రోడ్ సైక్లింగ్ పోటీలకు ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనుటకు ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 31 సాయంత్రం లోపు 9398230614 నంబరులో సంప్రదించాలని కోరారు. పాల్గొనే క్రీడాకారులు తమ స్వంత సైకిల్‌తో హాజరు కావాలని సూచించారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఆగస్టు 30: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు ఎనిమిది మంది రైతులు 79క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 7,350 రూపాయలు చెల్లించి కొనుగోలు చేశారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఆగస్టు 30: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురు వాహనదారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లా ఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన 25 మంది వాహనదారులను శుక్రవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఒక వ్యక్తికి 10 రోజులు జైలుశిక్ష, ఇద్దరు వ్యక్తులకు 3 రోజుల జైలుశిక్ష, మొత్తం 6,500 రూపాయలు జరిమానా విధించారని సీఐ తెలిపారు. మిగతా 22 మంది వాహనదారులకు 35 వేల రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపకూడదని హెచ్చరించారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	8,500	5,555	80.5	60.118
ఎల్లంపల్లి	11,291	6,616	20.175	16.766
మిడ్ మానేరు	9,400	21,000	27.54	16.40
ఎల్ఎండీ	14.850	250	24.034	12.107

సీఎంను కలిసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- ఆశీర్వచనం అందించిన రాజన్న ఆలయ అర్చకులు

- శృంగేరి పీఠాధిపతులను కలిసేందుకు ప్రతిపాదనలు



సీఎం రేవంత్‌రెడ్డికి ఆశీర్వచనం అందిస్తున్న రాజన్న ఆలయ అర్చకులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 30: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి రూ. 50 కోట్ల నిధులు బడ్జెట్‌లో పెట్టడంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయానికి నిధులు కేటాయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజన్న ఆలయ అర్చకులు నమిలికొండ ఉమేశ్, సురేష్, చందు సీఎం రేవంత్‌రెడ్డికి ఆశీర్వచనం అందించారు. రాజన్న ఆలయ విస్తరణ కోసం శృంగేరి పీఠాదిపతులను కలివాల్సి ఉందని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే అనుమతులు తీసుకుని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించినట్లు తెలిసింది. వారం రోజుల్లో శృంగేరి పీఠాధిపతులను కలిసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాగా త్వరలోనే రాజన్న ఆలయాన్ని దేవాదాయశాఖ కమిషనర్‌తో పాటు ప్రభుత్వ కార్యదర్శిలు సందర్శించనున్నట్లు చెప్పారు. సీఎంను కలిసిన వారిలో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, దేవాదాయశాఖ స్థపతి వల్లియాగం, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

పలువురికి జరిమానాలు



జరిమానా రశీదు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 30: సిరిసిల్ల పట్టణంలోని పుర వీధుల్లో చెత్తను విచ్చల విడిగా పడవేస్తున్న అపరిశుభ్రం చేస్తున్న దుకాణ యజమానులను శుక్రవారం మున్సిపల్ పారిశుధ్య విభాగం అధికారులు గుర్తించి జరిమానాలను విధించారు. ఒక్కక్కరికి రూ. 500ల నుంచి రూ. 1000 వరకు జరిమానాలు విధించి దుకాణం యజమానులకు జరిమానా రసీద్‌లను మున్సిపల్ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది అందజేశారు. భవిష్యతు‍్తలో ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే భారీ జరిమానాలు విధి స్తామని దుకాణ యజమానులను హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఉమర్, శేఖర్, దేవయ్య, రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు నవోదయం



నవోదయ విద్యాలయం

విద్యతో పాటు నైతిక విలువలకు పెద్ద పీట వేసి విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తున్న నవోదయ విద్యాలయాలు నవశకానికి నాంది పలుకుతున్నాయి. ప్రతిభ ఉన్నా చదువు కోలేని గ్రామీణ విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపుతోంది జవహర్ నవోదయ విద్యాలయం.

- గ్రామీణ ప్రాంతాల వారికి ప్రాధాన్యం
- ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధన
- దరఖాస్తులకు నోటిఫికేషన్ విడుదల
- సెప్టెంబరు 16 తుది గడువు

చొప్పదండి, ఆగస్టు 30: ఉత్తమ విలువలు, ఉన్నత ప్రమాణాలు, దేశ భక్తి, నైపుణ్యం, క్రీడలలో భాగస్వామ్యం, చదువుతోపాటు సమాజ సేవ ఇవన్నీ నవోదయ విద్యాలయంలోనే సాధ్యం. క్రమశిక్షణకు పెట్టింది పేరైన జవహర్ నవోదయ విద్యా లయంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆరు నుంచి 12 వ తరగతి వరకు పూర్తి గా రెసిడెన్షియల్ పద్ధతిలో ఉచిత విద్యను అంది స్తారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్ష కోసం నవోదయ విద్యాలయ సమితి దేశవ్యాప్తంగా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

- సీబీఎస్ఈ సిలబస్..

విద్యాలయంలో ఆరో తరగతి నుంచి కంప్యూటర్ విద్యను ప్రత్యేకంగా బోధిస్తారు. సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యాబోధన, ఆధునా తనమైన సైన్స్ లైబ్రరీ, డిజిటల్ తరగతి గదులు, జిమ్ హాల్, క్రీడా మైదానం కలిగి ఉండడం విద్యాల యం ప్రత్యేకతలు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు తప్పనిసరిగా క్రీడల్లో పాల్గొనాలి. మొక్కలను నాటి వాటి సంరక్షణ విద్యార్థులు చూసుకోవాలి. విద్యార్థులపై ఎలాం టి ఖర్చు లేకుండా పూర్తిగా రెసిడెన్షియల్ ప ద్ధతిలో బోధనను అంది స్తున్నారు. విజ్ఞాన జ్యో తి పథకంలో భాగంగా 9 నుంచి 12వ తరగతి బాలికలకు నీట్, ఐఐటీ కోచింగ్ కోసం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను అందిస్తోంది.



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్

- 80 సీట్లకు గానూ..

విద్యాలయంలో ఆరో తరగతిలో ఉన్న 80 సీట్లు గాను ఉమ్మడి జిల్లా విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. 14బ్లాక్‌ల వారీగా దర ఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యార్థులు ఆన్‌లైన్ లోనే తమ దరఖాస్తులు చేసుకోవాలి. సెప్టెంబరు 16 తేదీని దరఖా స్తులకు చివరి తేదీగా ప్రకటించారు. 2025 జనవరి 18న ప్రవేశ పరీక్షను జాతీయస్థాయిలో సీబీఎస్ఈ నిర్వహిసున్నది. ప్రవేశపరీక్ష కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు తొమ్మిది వేల దరఖాస్తులు రాగా జాతీయస్థాయిలో మూడో స్థానంలో నిలిచి విద్యాలయం అవార్డును దక్కించుకుంది.

- గ్రామీణ విద్యార్థులకు 75శాతం..

విద్యాలయంలో 80 సీట్లకు గాను75 శాతం మేరకు 60 సీట్లను గ్రామీణ విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన 20 సీట్లను పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో 15 శాతం ఎస్సీల కు, 7.5 శాతం ఎస్టీలకు, మూడు శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో మూడింట ఒక వంతు సీట్లను బాలికలకు రిజర్వ్ చేస్తారు. ప్రవేశ పరీక్ష మార్కులు, మెరిట్, క్యాటగిరి ఆధారంగా సీబీఎస్సీఈ ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తుంది.

అర్హులు దరఖాస్తు చేసుకునేలా..



అర్హులైన ప్రతి విద్యార్థి నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నాం. విద్యార్థుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుంది. దళారుల మాటలు నమ్మి మోస పోవద్దు. విద్యార్థులు కష్టపడి చదివితే సీటు సాధించవచ్చు. ఈ ఏడాది అత్యధికంగా దరఖాస్తులు వచ్చేందుకు కృషి చేస్తున్నాం. ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తాం.

- మంగతాయారు, ప్రిన్సిపాల్

ప్రవేశ పరీక్షకు అర్హతలు..

ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులు మూ డు నుంచి ఐదో తరగతి వరకు ప్రభు త్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలి. ఐదో తరగతి తప్పనిసరిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చదవాలి. విద్యార్థి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వారై ఉండాలి. 2013 మే1 నుంచి 2015 జూలై 31 లోపు జన్మించిన వారే దరఖాస్తులకు అర్హులు. విద్యార్థికి ఆధార్‌కార్డు తప్పనిసరిగా ఉండాలి. లేనట్లయితే తహసీ ల్దార్ కార్యాలయం నుంచి నివాస ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంటుంది. కాగా విద్యార్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యార్థి తన బ్లాక్ ఎంచుకొని వెబ్‌సైట్‌లో పొందుపరచాలి. విద్యార్థులు తప్పని సరిగా గ్రామాలకు చెందిన వారే ఉండాలి. చొప్పదండి, కొత్తపల్లి, హుజూరాబాద్, పెద్దపల్లి, మంథని. సుల్తానాబాద్, రాయికల్, ధర్మపురి, మెట్‌పల్లి, జగి త్యాల, కోరుట్ల, సిరిసిల్ల, వేములవాడ మున్సిపా లిటీలుగా మారగా ఇక్కడ నివసించే విద్యార్థులు అర్బన్ క్యాటగిరి కిందికి వస్తారు. ఈ ప్రాంత విద్యార్థులు అర్బన్ కోటా కిందనే దరఖాస్తు చేసుకోవాలి.

భారీ వర్షం

●పొంగిపొర్లిన వాగులు ●లోతట్టుప్రాంతాలు జలమయం

జగిత్యాల అర్బన్/జగిత్యాలరూరల్, ఆగస్టు 30 : జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి సగటున 40 మి.మీ వర్షం కురిసింది. అత్యధికంగా మేడిపల్లిలో 86.1 మిల్లీ మీటర్లు, జగిత్యాలలో 84.6, జగిత్యాల రూరల్‌లో 74.4, మల్యాలలో 73.3, రాయికల్ మండలంలో 65.5, మల్లాపూర్ మండలంలో 55.8, పెగడపల్లిలో 42.2, కొడిమ్యాలలో 41.8, మెట్‌పల్లిలో 36.6, కథలాపూర్‌లో 34.2, సారంగాపూర్ మండలంలో 34.2, ఇబ్రహీంపట్నంలో 20మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జగిత్యాల పట్టణంతోపాటుగా, పరిసర ప్రాంత గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జగిత్యాల జలమయంగా మారింది. వాగులు, లోతట్టు ప్రాంతా ల్లోకి భారీగా వర్షంనీరు చేరుకోవడంతో లోతట్టు ప్రాంతాల్లోకి, కాలనీల్లోని ఇండ్లలోకి వర్షం నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని గోవిందుపల్లి వాగు, మోతె వాగు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో గోవిందుపల్లి అవతలివైపు ఉన్న వెంకటాద్రినగర్‌కు సంబంధాలు తెగిపోయాయి. మోతె వాగు పొంగి పొర్లడంతో గొల్లపల్లి నుంచి జగిత్యాలకు రహదారి రాకపోకలు నిలిచిపోయాయి. నీరు వాగుపైకి భారీగా ప్రవహించడంతో ప్రయాణికులు ఇతర దారి గుండా రాకపోకలు సాగించారు. వెంకటాద్రినగర్ కాలనీకి అత్యవసరం ఉన్నవారిని జేసీబీ సహాయంతో వాగు దాటించారు. సుమారు 500ల కుటుం బాల వరకు వాగు అవత లివైపు నివసిస్తుండగా భారీ వర్షం పడినప్పుడల్లా ఇదే పరిస్థితి నెలకొంటుందని ఇప్పటికైనా వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



చల్‌గల్ వద్ద బ్రిడ్జిపై నుంచి పారుతున్న వరద నీరు



ఉధృతంగా ప్రవహిస్తున్న మోతె వాగు

బేసిక్ పే అమలు చేయాలి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 30: విద్యాశాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేసే వరకు బేసిక్ పే విధానం అమలు చేయాలని కోరుతూ జిల్లా సమగ్ర శిక్ష జేఏసీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని స్థానిక ఎంఆర్‌సీ భవనం నుంచి, కొత్త బస్టాండ్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023లో సమ్మె చేస్తున్న సమయంలో అప్పటి టీపీసీసీ ప్రెసిడెంట్ నేటి రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి రెగ్యులర్ చేయడంతో పాటు, అప్పటి వరకు బేసిక్ పే ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు.



నిరసన తెలుపుతున్న సమగ్ర ఉద్యోగులు

క్రైం వార్తలు

అనుమతులు లేకుండా డీజేలు నడిపిస్తే చర్యలు

- నిబంధనలు అతిక్రమించిన ముగ్గురు డీజే నిర్వాహకుల అరెస్ట్

- సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 30: ఎలాంటి అనుమతులు లేకుండా డీజేలు నడిపిస్తే కఠిన చర్యలు తప్పవని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని పోలీస్ సబ్ డివిజనల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నిబంధలనకు విరుద్ధంగా డీజేలు నడుపుతూ పోలీసు విధులకు ఆటంకం కలిగిస్తూ ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు. పోలీస్ విధులకు ఆటంకం కలిగిస్తే, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. సిరిసిల్ల పట్టణం పెద్దూరులో గల డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద నిబంధలనకు విరుద్ధంగా డిజేను రోడ్డుకు అడ్డంగా పెట్టుకొని ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని డయల్ 100కు సమాచారం రావడంతో వెంటనే బ్లూకోల్ట్స్ సిబ్బంది వెళ్లి ఆపమని చెప్పినా ఆపకుండా విధులకు ఆటంకం కల్పించిన దొంతరవేణి నవీన్, దొంతరవేని మల్లేశ్, దొంతరవేణి రంజిత్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఈ ముగ్గురిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు.

బైండోవర్ అతిక్రమించిన వారికి జరిమానా

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 30: బైండోవర్ నిబంధనలు అతిక్రమించిన ముగ్గురికి గురువారం జరిమానా విధించి, మరొకరికి వారెంట్ జారీచేశామని సిరిసిల్ల టౌన్ సీఐ కె కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన లింగంపల్లి అనిల్(28) అనే యువకుడు మానేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేయడంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఈ బైండోవర్‌ను అతిక్రమించి మళ్లీ ఇసుకను అక్రమ రవాణా చేసినందున అతనిపై కేసు నమోదుచేసి తహసీల్దార్ ఎదుట హాజరు పరచగా రూ. 15వేల జరిమానా విధించారన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన బల్వీర్‌సింగ్ (42), చంద్రంపేటకు చెందిన సంపంగి మల్లవ్వ(53) బెల్ట్‌షాప్ నిర్వహించడంతో బైండోవర్ చేశామన్నారు. బైండోవర్ అతిక్రమించి మళ్లీ అదే షాప్ నిర్వహించడంతో ఒక్కొక్కరికి తహసీల్దార్ రూ. 20వేల జరిమానా విధించారన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన తుమ్మల శివకుమార్(21) అనే యువకుడు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించడంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. మళ్లీ అదేవిధంగా చేసినందుకు అతనికి వారెంట్ జారీచేశారని టౌన్ సీఐ తెలిపారు. బైండోవర్‌ను ఎవరూ అతిక్రమించినా చర్యలు తప్పవన్నారు. చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించకూడదని, జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు.

బైండోవర్లను అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 30: బైండోవర్లను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్, అక్కపల్లి గ్రామాల్లో గతంలో పలు నేరాలకు పాల్పడడంతో ముగ్గురు వ్యక్తులను తహసీల్దార్ రామచంద్రం ఎదుట శుక్రవారం హాజరు పర్చడంతో జరిమానా విధించారని పేర్కొన్నారు. రాచర్లబొప్పాపూర్, అక్కపల్లి గ్రామాల్లోని అనరాశి కిష్టయ్య దొంగిలించిన ఇనుప సామగ్రి కొనుగోలు చేయడం, మద్యం అనుబంధ దుకాణాలను నిర్వహిస్తున్న బొమ్మనవేణి పర్శరాములు, మందాటి సతీష్‌ను గతంలో బైండోవర్ చేశామని చెప్పారు. బైండోవర్లను అతిక్రమించడంతో తహసీల్దార్ ఎదుట హాజరు పర్చగా కిష్టయ్యకు రూ.25 వేలు, బొమ్మనవేణి పర్శరాములుకు రూ.25 వేలు, మందాటి సతీష్‌లకు రూ.10 వేలు జరిమానా విధించారని వివరించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే బైండోవర్ చేస్తామని పేర్కొన్నారు. అతిక్రమిస్తే జరిమానాలు విధించడంతో పాటు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని సీఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు.

భూ వివాదం కేసులో ఆరుగురి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 30: తప్పుడు రిజిస్ట్రేషన్‌ద్వారా నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, భూ వివాదాన్ని సృష్టించిన 21 మందిపై కరీంనగర్ రెండో టాణా పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆరుగురు నిందితులు చిట్టుమల్ల శ్రీనివాస్, చిట్టుమల్ల అచ్యుత్ చైతన్య, గంప నాగరాజు, దేశబోయిన శ్రీకాంత్, దేశబోయిన గోపాల్, దేశబోయిన శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కరీంనగర్ రెండో టాణా సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌కు చెందిన నీరుమల్ల శ్యాంసుందర్ మానకొండూర్ పరిధిలోని సర్వే నంబర్ 1262, 1266లో రెండు ఎకరాల ఇరువయిన్నర గుంటల భూమిని దేశబోయిన బాలయ్య, దేశబోయిన జగత్‌ప్రకాష్, దేశబోయిన శ్రీనివాస్, దేశబోయిన గోపాల్, దేశబోయిన శ్రీకాంత్ నుంచి కొనుగోలు చేశాడు. ధరణి పోర్టల్‌లో పొరపాటున ఈ నలుగురిపేరిట నాలుగు ఎకరాల భూమికి బదులుగా ఏడు ఎకరాల పద్నాలుగున్నర గుంటల భూమి ఉన్నట్లు తప్పుగా నమోదైంది. దానిని అదునుగా భావించి మోకాపై లేని భూమిని పలువురికి విక్రయించారు. నీరుమళ్ల శ్యామ్‌సుందర్‌కు విక్రయించిన భూమిలోని తొమ్మిది గుంటలను కొండా మురళి అనే వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేశారు. ఇది అన్యాయమనినీరుమల్ల శ్యాం సుందర్ నిలదీయగా 25 లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. శ్యాం సుందర్ కొన్న భూమిలోంచి ఎకరం రెండు గుంటలను చిట్టుమల్ల శ్రీనివాస్, అతని కుమారుడైన చిట్టుమల్ల అచ్యుత్‌చైతన్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ విషయంపై శ్యాంసుందర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న చిట్టుమల్ల శ్రీనివాస్ శ్యాంసుందర్‌ను కేసులు ఉపసంహరించుకోవాలని, సమస్యను తాను పరిష్కరిస్తానని చెప్పారు. దీంతో శ్యాంసుందర్ కేసులను ఉపసంహరించుకున్నాడు. తర్వాత పట్టించుకోలేదు. మళ్లీ సమస్యను పరిష్కరిస్తానని 11 గుంటల భూమిని బొల్లినేని సృజన్‌రావుపై రిజిస్ట్రేషన్ చేయించుకుని, అతని నుంచి తిరిగి కొత్త జైపాల్‌రెడ్డికి బదలాయించాడు. మరి కొంత భూమిని పట్టాదారులతో కుమ్మక్కై కొండా మురళి, వంగల సంతోష్, గంప ఫణీంద్రకు రిజిస్ట్రేషన్ చేశాడు. దీంతో నీరుమళ్ల శ్యాంసుందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ జరిపి చిట్టుమల్ల శ్రీనివాస్, చిట్టుమల్ల అచ్యుత్ చైతన్య, గంప రమేష్, కొండా మురళి, వంగల సంతోష్ కుమార్, గంప నాగరాజు, గంప లవకుమార్, , గంప రవళి, వంగల గీత, గంప ఫణింద్ర, యంసాని రాధా కృష్ణ, ఆకుల సుదర్శన, దేశబోయిన జగత్‌ప్రకాష్, దేశబోయిన. శ్రీనివాస్, దేశబోయిన. గోపాల్, దేశబోయిన శ్రీకాంత్, రేగొండ సందీప్, మాకు వెంకట శారదా దేవి, బొల్లినేని సృజనరావు, కొత్త జయపాల్‌రెడ్డి, దువ్వంతుల లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేశామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.



నిందితులను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

యువకుడి ఆత్మహత్య

- ఉద్యోగం రాలేదన్న మనస్తాపంతో దారుణం



పవన్(ఫైల్)

కోల్‌సిటీ, ఆగస్టు 30: గోదావరిఖని గంగానగర్‌కు చెందిన దాతు పవన్(25) అనే యువకుడు గురువారం రాత్రి ఇంట్లో ఉరివేసు కుని ఆత్మహత్య చేసుకు న్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... రామగుండం నగరపాలక సంస్థ 8వ డివిజన్ కార్పొరేటర్ దాతు శ్రీనివాస్ కుమారుడు పవన్ బీటెక్ పూర్తి చేశాడు. ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలకు ప్రయత్నించాడు. కొన్నిరో జుల పాటు ఉద్యోగం చేసి పవన్ మెరుగైన ఉద్యోగానికి ప్రయత్నించే క్రమంలో ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపానికి గుర య్యాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పవన్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పవన్ తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ భూమేష్ తెలిపారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, మేయర్ బంగి అనీల్ కుమార్, కమిషనర్ శ్రీకాంత్, కార్పొరేటర్లు తదితరులు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు



గోపురానికి రంధ్రం చేసిన దుండగులు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 30: మండలంలోని ముత్తారం గ్రామ పంచాయతీ దర్మాబాద్‌లో ఉన్న ప్రాచీన కాలం అం డాలమ్మ దేవాలయ గోపురాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం ధ్వంసం చేశారు. దేవాలయ గోపురానికి రంధ్రం చేసి నిచ్చె న ద్వారా అందు లో గుప్త నిధుల కోసం వెతికి నట్లు అనవాళ్లు ఉన్నాయి. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోరుట్ల, ఆగస్టు 30: పట్టణ శివారులోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మెట్‌పల్లి మండల కోనరావుపేట గ్రామానికి చెందిన ఎనుగు గంగారెడ్డి (58) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. మూడు రోజుల క్రితం వాహనాలు ఢీకొన్న సంఘటనలో గంగారెడ్డితో పాటు పశువైద్య కళాశాలకు చెందిన విద్యార్థి త్రీవ గాయాలు కాగా స్థానికుల సహకారంతో వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గంగారెడ్డి గురువారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేధింపుల కేసులో రెండేళ్ల జైలు

ధర్మారం, ఆగస్టు 30: మండల కేంద్రానికి చెందిన రాగుల మల్లేశం అనే నేరస్తుడికి వేధింపుల కేసులో శుక్రవారం నందిమేడారం కోర్టులో జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎన్ వెంకటసచిన్‌రెడ్డి రెండేళ్ల పాటు జైలు, రూ.6వేలు జరిమానా విధి స్తూ తీర్పు ఇచ్చారు. తేది. 2.12.2015న రాగుల శ్రీలత తన భర్త మల్లేశం మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తనను వేధిస్తున్నాడని తన అత్త లక్ష్మి, మామ రాజయ్యలు మద్దతు పలుకుతున్నారని ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై లక్ష్మీనారాయణ కేసు నమోదు చేశారు. శుక్రవారం సాక్షులను విచారించిన జడ్జి నేరస్తుడికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

డైలీ ఫైనాన్స్ వ్యాపారులపై పోలీసుల కొరడా

- సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో దాడులు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 30: డైలీ ఫైనాన్స్ వ్యాపారులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గల డైలీ ఫైనాన్స్, వడ్డీ వ్యాపారస్తుల ఇళ్లు, ఆఫీసుల్లో పోలీసులు దాడులు చేసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సిరిసిల్ల టౌన్, వేములవాడ టౌన్, తదితర అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వడ్డీ వ్యాపారస్తులు, డైలీ ఫైనాన్స్ వ్యాపారస్థుల ఇళ్లలో సోదాలు చేశారు. ఈ సోదాల్లో పలు ప్రామిసరీనోట్లు, డాక్యుమెంట్లను, చెక్కులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడారు. జిల్లాలో అనుమతులు లేకుండా డైలీ ఫైనాన్స్ వ్యాపారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సామాన్య ప్రజలను అధిక వడ్డీల పేరిట ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని డబ్బులు ఇచ్చి వారి నుంచి అధిక వడ్డీ రేట్లతో సామాన్యులపై దౌర్జన్యం చేస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చట్టపరమైన పద్ధతులతో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే ప్రజలు నమ్మాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ ఫైనాన్స్ వ్యాపారం నడిపేవారి వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో సమాచారం ఇవ్వాలన్నారు. డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. ఈ మేరకు 16 మందిపై కేసు నమోదు చేసి 8.60లక్షల నగదుతో పాటు 43 బ్లాంక్ చెక్కులు, 36 ప్రామీసరి నోట్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.

గంభీరావుపేట: మండల కేంద్రానికి చెందిన గాద గణేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. అవసరం ఉన్న వారికి డబ్బు ఇస్తూ అధిక వడ్డీ వసూలు చేస్తున్నాడనే ఫిర్యాదు మేరకు గాద గణేశ్ ఇంటిలో శుక్రవారం పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండు ఖాళీ చెక్కులు, 15 ప్రామిసరీ నోట్లు, ఓ వర్జినల్ ఆర్సీ పేపర్ లభించాయి. దీంతో గాద గణేష్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్ఐ తెలిపారు.



సిరిసిల్లలో వడ్డీ వ్యాపారుల ఇళ్లల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ నిర్మాణం

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి



బోనం ఎత్తుకున్న చైర్‌పర్సన్ కళాచక్రపాణి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 30: మైసమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయాన్ని పునర్నిర్మాణం చేపట్టామని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కూరగాయాల మార్కెట్ లోని మైసమ్మ ఆలయం పునర్నిర్మాణం చేపట్టగా మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన బబజరగిగింది. ఈ సందర్భంగా శుక్రవారం పోచ్చమ్మ బోనాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి హాజరయ్యారు. చైర్‌పర్సన్ పోచమ్మ బోనాన్ని అమ్మవారికి సమర్పించి మొక్కులను చెల్లించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ దేవాలయాల నిర్మాణాలు భావితరాలకు మనం అందిస్తే ఆధ్యాత్మిక వారసత్వ సంపదగా నిలుస్తాయన్నారు. సంస్కృతిసంప్రదాయాల్లో భాగంగా నిర్వహించే పండగలు ప్రజల్లో ఆధ్యాత్మిక భావజాలాన్ని శాంతిని, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయ న్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ, పద్మశాలి యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు గుండ్లపెల్లి పూర్ణచందర్, వేంకటేశ్వర కూరగాయల మార్కెట్ సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, కూరగాయల వ్యాపారులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా నవగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఇల్లంతకుంట, ఆగస్టు 30: మండలంలోని పెద్ద లింగాపూర్ గ్రామంలోని పాటి మీది హనుమాన్ ఆలయంలో ఘనంగా నవగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో శుక్రవారం వేద బ్రాహ్మణులచే నవగ్రహాలను ప్రతిష్ఠించారు ఆలయ పునర్‌నిర్మాణం కోసం కృషిచేసిన మాజీ సర్పంచ్ గొడిసెల జితేందర్‌గౌడ్‌ను పలువురు అభినందించారు. వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగించవద్దు



ప్రజలతో మాట్లాడుతున్న ఆర్ఐ ప్రవీణ్

వీర్నపల్లి, ఆగస్టు 30: గ్రామాల్లో పౌర హక్కులకు భంగం కలిగించద్దని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ అన్నారు. వీర్నపల్లి మండలం కంచర్లలో పౌర హక్కుల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. పౌర హక్కులకు భంగం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పౌర హక్కుల ప్రతిజ్ఞ చేయించారు.

● ఆయా శాఖల అధికారులు డుమ్మా...

వీర్నపల్లి మండలంలో ప్రతినెలా నిర్వహించే పౌర హక్కుల దినోత్సవం రెవెన్యూ అధికారులు తప్ప మిగతా శాఖల అధికారులు హాజరు కాకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పౌరులకు అవగాహన కల్పించాల్సిన అధికారులే పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొనకపోతే పౌరహక్కులపై చర్యలు ఎలా తీసుకుంటారని చర్చించుకుంటున్నారు.

అంకితభావంతో పనిచేసినప్పుడే గుర్తింపు

- ఎస్పీ అఖిల్ మహాజన్



హోంగార్డును సన్మానిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 30: అంకితభావంతో పనిచేసినప్పుడే గుర్తింపు లభిస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో 34ఏళ్లుగా విధులు నిర్వహించి పదవీవిరమణ పొందిన హోంగార్డు పి మల్లయ్యను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌శాఖలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహించి పదవీవిరమణ పొందిన వారి సేవలు మరువలేమని, వారి కుటుంబంలో ఎలాంటి సమస్య వచ్చిన తనను నేరుగా సంప్రదించవచ్చన్నారు. రిటైర్‌మెంట్ అనేది కేవలం వృత్తికే పరిమితమని, వ్యక్తిత్వానికి కాదన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేశ్, హెడ్‌కానిస్టేబుల్ రవిందర్‌తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

కోనరావుపేట, ఆగస్టు 30 : ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంలా పని చేస్తుందని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి తాళ్లపెల్లి ప్రభాకర్ అన్నారు. మండలంలోని నిజామాబాద్ గ్రామంలో శుక్రవారం శివరాత్రి శేఖర్‌కు రూ. 22500, కొల్లూరి శ్రీనివాస్ రూ 47,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందుతున్నాయని అన్నారు. కృషి చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లంబ రాజు, ముత్యాల శ్రీనివాస్, తాళ్లపల్లి రాజయ్య, రాజేందర్, చిరంజీవి, రాజిరెడ్డి, మధు, మనోహర్, లక్ష్మీరాజం, కొండయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడి కుటుంబానికి పరామర్శ

వేములవాడ, ఆగస్టు 30: అనారోగ్యంతో మృతి చెందిన వేములవాడ పట్టణానికి చెందిన ప్రధానోపాధ్యాయుడు పూరెల్లి రవీందర్ కుటుంబాన్ని భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు. రవీందర్ మరణించిన విషయం తెలుసుకున్న మనోహర్ రెడ్డి శుక్రవారం నాడు స్థానిక నాయకులు నారాయణ, ఉడుతల రాము, రాంబాబు, మహేష్, కార్తిక్ తదితరులతో కలిసి మృతుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం

కోనరావుపేట, ఆగస్టు 30: పదోన్నతి బదలీలపై వెళ్తున్న ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కోనరావుపేట మండలం మరిమడ్ల ప్రభుత్వ పాఠశాలలో పనిచేసిన ఈగ శ్రీనివాస్, కదిరే గంగాధర్ పదోన్నతిపై అలాగే పద్మజ, పద్మ బదిలీపై వెళ్లడంతో వారిని మాజీ సర్పంచ్ మాట్ల అశోక్, ఎస్ఎంసీ చైర్మన్ పుల్కం మల్లేశం ఘనంగా సన్మానించారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ

- కంపుకొడుతున్న మురుగుకాలువలు
- రహదారిపై పారుతున్న నీరు
- ప్రబలుతున్న వ్యాధులు.. ఇబ్బందుల్లో ప్రజలు



బోరు మోటారు చుట్టూ అపరిశుభ్రంలోనే నీటిని పట్టుకుంటున్న మహిళ



రోడ్డుపై నిలిచిన నీరు



కాల్వలో పేరుకుపోయిన మురుగు నీరు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 30: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 11, 12వ వార్డుల్లో మౌలిక వసతులు లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు అందకపోవడంతో కలుషిత నీరు దిక్కవుతోంది. మురుగు నీటి కాల్వలు కంపుకొడుకుతున్నాయి. రహదారిపై నీరు నిలవడం వల్ల అందులోంచే ప్రజలు వెళ్లాల్సిన దుస్థితి దాపురిస్తోంది. ఎక్కడ చూసినా అపరిశుభ్రమే తాండివిస్తోంది. కాలనీ ప్రజలకు అందించే బోరు బోవుల చుట్టు నాచు పేరుకుపోయింది. అక్కడే నిలబడి తాగునీటిని పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అపరిశుభ్రం, కలుషిత నీరు వల్ల వ్యాధులు ప్రబలి జనం మంచం పడుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను తీర్చాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

- అపరిశుభ్రం.. రోగాలమయం

గ్రామంలోని 11, 12వ వార్డుల్లో సుమారు 200 కుటుంబాలు జీవిస్తున్నాయి. కాలనీల్లో పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. మురుగు నీటి కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. దుర్వాసన వెదజల్లుతోంది. ఇళ్లలోని మురుగునీరు రహదారులపై చేరుతోంది. ఈగలు, దోమలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడుతున్నారు. మిషన్ భగీరథ పైపులు ధ్వంసం కావడం వల్ల ప్రజలకు వార్డులో ఉన్న రెండు బోరుబావులే ప్రధానం. బోరు బావుల చుట్టు అపరిశుభ్రం నెలకొంది. గత్యంతరం లేక అందులోనే నిలబడి తాగునీరు పట్టుకోవాల్సి వస్తోంది. ఓ వైపు అపరిశుభ్రం.. మరో వైపు కలుషిత నీరు వల్ల వార్డులు రోగాలమయంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి వార్డుల్లో నెలకొన్న సమస్యలను తీర్చాలని వార్డువాసులు కోరుతున్నారు.

రోడ్లపై మురుగు నీరు పారుతోంది

- ఈబూది రవీందర్, కాలనీవాసి



వార్డుల్లో మురుగు నీటి కాల్వలు నిండిపోయాయి. శుభ్రం చేయకపోవడం వల్ల మురుగు నీరు రోడ్లపై పారుతోంది. సీసీ రోడ్లు పూర్తి స్థాయిలో నిర్మించకపోవడంతో ఇళ్ల ముందు బురదగా మారుతోంది. కంపు భరించలేకపోతున్నాం. దోమలు కుట్టి చంపుతున్నాయి. జ్వరాల బారిన పడుతున్నాం. సార్లు పట్టించుకుని చర్యలు తీసుకోవాలే.

బోరు చుట్టు నాచు పట్టింది

- జహేరాబేగం, కాలనీ వాసి



మా వార్డులో మిషన్ భగీరథ నీరు రావడం లేదు. ఉన్న బోరు చుట్టూ నాచు పట్టింది. అందులోనే నిలబడి నీళ్ల పట్టుకుంటున్నాం. కలుషిత నీరు తాగాల్సి వస్తోంది. సరైన మురుగు నీటి కాల్వలు లేవు. ఈగలు, దోమల బాధతోనే కాలం వెళ్లదీస్తున్నాం. వెంటనే సమస్యలు పరిష్కరించాలి.

సమస్యలను పరిష్కరిస్తాం

- గణేష్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి

15 రోజుల కిందట ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాను. గ్రామంలోని 11, 12వ వార్డుల్లో నెలకొన్న సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తాం. మురుగు నీటి కాల్వలతో పాటు బోరు బావుల చుట్టు ఉన్న అపరిశుభ్రతను తొలగిస్తాం. పారిశుధ్య చర్యలు చేపట్టి సమస్యలను పరిష్కరిస్తాం.

శ్రావణమాసం ప్రత్యేక పూజలు

తంగళ్లపల్లి, ఆగస్టు 30: శ్రావణమాసం శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని తంగళ్లపల్లి మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సంతోష్ మాత దేవాలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని సత్యసాయిబాబా మందిరంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధల నడుమ పూజలను జరిపించారు. కార్యక్రమంలో సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రాజరాజేశ్వర దేవి (నాయకమ్మ) ఆలయంలో శ్రావణ మాస చివరి శుక్రవారం సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో వచ్చి పూజలు చేశారు. నిర్వాహకులు భక్తుల కోసం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కూర సూరేష్, జిల్లా అధ్యక్షుడు బొప్పా దేవయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ డైరెక్టర్ నారాయణ రావు, నాయకులు లక్ష్మణ్, వెంకట స్వామిగౌడ్, గంద్యాడపు రాజు, మీసం రాజాం, బండారి బాలరెడ్డి, గంట శ్రీనివాస్, రాజశేఖర్ తదితరులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న మహిళలు

వీహెచ్‌పీ, భజరంగదళ్ కార్యవర్గం



గూడెం దేవేందర్



ప్రశాంత్

ముస్తాబాద్, ఆగస్టు 30: పట్టణంలోని ఓ గార్డెన్‌లో జరిగిన శుక్రవారం జరిగిన సమావేశంలో విశ్వహిందూ, భజరంగదళ్ కార్యవర్గం ఎన్నుకున్నారు. విశ్వ హిందూ పరిషత్ మండల అధ్యక్షుడిగా గూడెం దేవేందర్, భజరంగ్‌దళ్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడిగా ప్రశాంత్, గోరక్షక్ దళ్ మండల అధ్యక్షుడిగా చేపూరి రాకేష్, ముస్తాబాద్ నగర సంయోజక్‌గా మద్దికుంట రమేష్‌ను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చేపూరి అశోక్, భజరంగ్ దళ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోకన్వీనర్ కన్నం శంకర్ హాజరై నియామక పత్రాలను అందించారు.

మిడ్ మానేరులో 15.40 టీఎంసీల నీరు

బోయినపల్లి/ఇల్లంతకుంట ఆగస్టు 30: మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6300, మానేరు, ములవాగు ద్వారా 3100 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. దిగువకు ఎల్ఎండీ ప్రాజెక్టు అయిదు గేట్ల ద్వారా 14,600 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండగా, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 312.45 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీల కు గాను ప్రస్తుతం 15.40 టీఎంసీల మేరకు ఉంది. ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామ సమీపంలో ని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 3.5 టీఎంసీల సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 3.11 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పాడి గేదె మృతి

వీర్నపల్లి: ఆగస్టు 30: విషపురుగు కాటుకు పాడి గేదె మృతి చెందిన ఘటన వీర్నపల్లి మండలం బాబాయ్ చెరువు తండా గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బానోతు రమేష్ పాడి గేదెను సమీపంలోని అటవీ ప్రాంతంలో మేత కోసం కట్టేసాడు. సాయంత్రం ఇంటికి తీసుకురావడానికి కట్టేసిన ప్రాంతానికి వెళ్లగా గేదె మృతి చెంది కనిపించింది. స్థానికులకు సమాచారం అందించగా గేదె పాముకాటుకు గురైనట్లు అనుమానం వ్యక్తం చేశారు. గేదె మృతితో రూ 70 వేల నష్టం వాటిల్లినట్లు రమేష్ వాపోయారు.

‘మధ్యాహ్న’ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కోనరావుపేట, ఆగస్టు 30: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పెడుతున్న కోడిగుడ్లను సోమవారం నుంచి ఆపుతున్నామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మధ్యాహ్న భోజన నిర్వాహకుల పెండింగ్ బిల్లులను వెంటనే అమలు చేయాలని అన్నారు. కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. కోడి గుడ్లకు కొనుగోలు భారం అవుతుందని ధర ఎక్కువగా ఉంటుందని అన్నారు. అందుకే ప్రభుత్వమే సరఫరా చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షురాలు విమల, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

● టోకెన్ సమ్మె నోటీస్...

బోయినపల్లి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు మండల విద్యాధికారికి మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్‌ను అందించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌యాదవ్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పదివేల రూపాయల వేతనాన్ని అందించాలని కోరారు. బోయినపల్లి మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై సెప్టెంబరు 9, 10 తేదీలలో టోకెన్ సమ్మె నోటీసును మండల విద్యాధికారికి శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వాహకులు సెప్టెంబరు 9, 10 తేదీల్లో జరిగే సమ్మెను జయప్రదం చేయాలన్నారు. సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించకపోతే అక్టోబరు 14 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని ప్రభుత్వాలను హెచ్చరించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు డ్రెస్ కోడ్ అమలు చేయాలని పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. సమానపనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వమే వంట సరుకులు, గ్యాస్ సిలిండర్లు, కోడిగుడ్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు నడిబొట్టు లక్ష్మి నరసయ్య బి కొమురయ్య, లావణ్య, ఐలవ్వ, కొమరవ్వ, నరసవ్వ, రాజవ్వ, భారతవ్వ, తదితరులు పాలొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, కార్మికులు

వేములవాడకు పోటెత్తిన భక్తులు



వర్షం కురుస్తుండడంతో ఈవో కార్యాలయం వద్ద ఉన్న భక్తులు

- వర్షంలోనూ మొక్కుల చెల్లింపులు
- మహాలక్ష్మి అమ్మవారికి ఒడిబియ్యం పోసిన మహిళలు



అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 30: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. శుక్రవారం తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయ క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరకుని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం వర్షం కురువడంతో భక్తులు వర్షంలోను తడుస్తూ స్వామివార్లను దర్శించుకుని తరించారు.

● మహాలక్ష్మి అమ్మవారికిప్రత్యేక పూజలు..

వేములవాడ రాజరాజేశ్వరీ అమ్మవారికి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉదయం, సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరస్వామి వారి అనబంధ ఆలయమైన మహాలక్ష్మి అమ్మవారికి ఉదయం అభిషేకము, అర్చన నిర్వహించగా సాయంత్రం నాలుగు గంటలకు షోడశోపచార పూజలు చేపట్టారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సీతారామచంద్రస్వామి వారికి ఉదయం 6.05 గంటలకు పంచోపనిషత్ ద్వారా అభిషేకము చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దసంఖ్యలో అమ్మవారి ఆలయానికి తరలివచ్చి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుని కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేములవాడలో భారీ వర్షం

వేములవాడ: వేములవాడ పట్టణంలో శుక్రవారం 45 మిల్లీమీటర్ల మేరకు వర్షం కురిసింది. తెల్లవారుజామున ప్రారంభమైన వర్షం దాదాపు రెండు మూడు గంటలు కొనసాగింది. ఫలితంగా పట్టణంలో పలు వీధులు బురదమయమయ్యాయి. వర్షం కారణంగా స్థానికులు, రాజరాజేశ్వరస్వామి వారి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఇబ్బంది పడ్డారు.

అర్హులైన వారందరికీ రుణ మాఫీ



సమావేశంలో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి, అగస్టు 30: అర్హులైన రైతులందరికీ మరో 27 రోజుల్లోనే రూ 18 వేల కోట్లు రుణమాఫీ ఖచ్చితంగా చేసి తీరుతామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ బీఆర్ఎస్ డ్రా మాలు చేస్తున్నరని మండిపడ్డారు. మేడిపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం రేవంత్‌రెడ్డి జూలై 15న రుణమాఫీ జీవో తెచ్చారని గుర్తు చేశారు. జులై 18 తేదిన లక్ష వరకు జులై 30న లక్షా50 వేల వరకు ఆగస్టు 15 రెండు ల క్షల వరకు రుణమాఫీ చేశామన్నారు. మొన్నటి వరకు అధికారంలో ఉండి రైతు సమస్యల పైన ఏ మాత్రం పట్టించుకోని వారు ఈ రోజు ధర్నాల పేరులో డ్రా మాలు చేస్తున్నారని అన్నారు. బీజేపీ బీఆర్ఎస్ చేస్తున్న నాటకాలను రైతులు నమ్మొద్దని, సాంకేతిక కారణంగా రుణమాఫీ కానీ రైతులకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేసి తీరుతామని అన్నారు. ఆ యన వెంట కాంగ్రెస్ నేతలు రమేష్‌రెడ్డి, నారాయణరెడ్డి, నాగరాజు, నర్సరెడ్డి, శం కర్, శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్, గంగరెడ్డి, గంగరాజం, అజీమ్ పాల్గొన్నారు.